www.jananinadam.com
RNI NO:TGTEL/25/A0870

# జననినాదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

జిల్లా వారిగా విలేకర్లు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న జననినాదం తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలెను, సంప్రదించాల్సి నెంబర్

9550100197,9490111460

శుక్రవారం 17-07- 2026
సంపుటి: 2 సంచిక: 81
ఆసిఫాబాద్ Asifabad
హైదరాబాద్ Hyderabad
ఎడిటర్ : జాధవ్ రోహిదాష్
Editor: JADAV ROHIDAS
పేజీలు : 04
వెల: రూ.2.00
Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com



### ఆగస్టు నుంచి అంగన్‌వాడీల్లో
# బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు
**మంత్రి సీతక్క**

**హైదరాబాద్ 16:** వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను అమలు చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టగా మంచి ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గుడ్లు, పాలు, ఇతర సరకుల సరఫరాలో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు.




### రాష్ట్రంలో రోడ్డు భద్రతకు
# కొత్త బ్యూరో ఏర్పాటు
**డిజిపి ఆనంద్ సివి ఆనంద్**

**హైదరాబాద్ 16:** తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో' ఏర్పాటుకు పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. బ్యూరో ఏర్పాటు, విధులు, సిబ్బంది, చేపట్టాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించారు. దీనికి సంబంధించిన చట్టపరమైన అంశాలు, పరిపాలనా విధానాలపై ప్రణాళికలు రూపొందిస్తున్నారు. డీజీపీ సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఇతర రాష్ట్రాల విధానాలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, కేంద్ర ప్రభుత్వ నిబంధనలపై చర్చించారు.



### గోదావరిజలాలతో
# ఉమ్మడిఖమ్మం సస్యశ్యామలం

- నీటిని మళ్లించి జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటాం
- ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే కెసిఆర్ డబ్బులు వృథా
- సీతారామ ప్రాజెక్ట్ పనులను పరిశీలించిన మంత్రులు
- ఖజనాపై భారం మోపారన్న డిప్యూటీ సిఎం భట్టి

**భద్రాద్రి కొత్తగూడెం16:** గోదావరిలో ప్రవహిస్తున్న జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే సంకల్పంతోనే ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేసి రైతాంగాన్ని ఆదుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇటీవల దేవాదుల ప్రాజెక్టును సందర్శించామని, నేడు సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తెలంగాణలో చివరి ప్రాజెక్టు అయిన సీతారామ ద్వారా గోదావరి నీటిని గరిష్టంగా సద్వినియోగం చేసుకుంటామని ప్రకటించారు. అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం గోదావరి తీరంలో మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ పెంచిందని సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




### కాళేశ్వరం బ్యారేజీల పై హైకోర్టు విచారణ
# కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

**హైదరాబాద్ 16:** కాళేశ్వరం బ్యారేజీల అంశంపై కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం, ఎన్డీఎస్యే కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మేడిగడ్డ పిల్లర్ల మరమ్మతులు చేపట్టకుండా రాజకీయాలు చేస్తున్నారని హైకోర్టులో పిటిషన్ దాఖలయిన విషయం తెలిసిందే.కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని పిటిషనర్ ఆరోపణ. రైతుల ప్రయోజనాల కోసం ఎన్డీ ఎస్ ఏ నివేదిక ప్రకారం మేడిగడ్డను పునరుద్ధరించాలని వాదన. మిగిలిన రిజర్వాయర్లపై కూడా ఎన్డీఎస్ ఏ దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, కన్నెపల్లి, సుందిళ్ల పంప్హౌస్ల భద్రతపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, ఎన్డీఎస్ ఏ తో పాటు సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.

# సైదాబాద్ సక్సెస్ స్కూల్లో ఇస్లాం బోధన

- రెండో తరగతి విద్యార్థికి మతపైరమన హోం వర్క్
- టీచర్ను నిలదీత.. పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు
- ఘటనపై మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్,జూలై16:** హైదరాబాద్లోని సైదాబాద్ ప్రాంతంలోని సక్సెస్ స్కూల్ మతపరమైన హోంవర్క్ ఇచ్చారనే ఆరోపణలు వివాదానికి దారితీశాయి. రెండో తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి 'కల్మా', 'సూరహ్ ఫాతిహా' రాసి, పఠించాలని హోంవర్క్ ఇచ్చినట్లు విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ





### తేనెటీగల పెంపకంపై ప్రత్యేక శిక్షణ
# కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క

**ములుగు16:** గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి జీవనోపాధుల కార్యక్రమంలో భాగంగా హంబుల్ బీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మక్క?సారక్క మండల సమాఖ్య పరిధిలోని వెలుగురేఖ గ్రామ సంఘం మహిళలకు శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, హంబుల్ బీ సంస్థ ప్రతినిధులు,స్వయం సహాయక సంఘాల మహిళలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### నల్లగొండ లక్ష్మీనరసిహస్వామి ఆలయంలో
# కేంద్రమంత్రి బండి సంజయ్ పూజలు

**కొడిమ్యాల16:** కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని కేంద్ర మంత్రి బండి సంజమయ్ కుమార్ గురువారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. తరువాత వేదపండితులు ఆశీర్వచదించి స్వామివారి ప్రసాదం అందజేశారు. జాతర సందర్భంగా స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు కలుగుతున్న పలు ఇబ్బందుల గురించి వారు వివరించగా వాటర్ ప్లాంట్, టాయిలెట్స్ నిర్మాణంతో పాటు గుట్ట మీది దేవాలయం వద్ద లైటింగ్ ఏర్పాటు, ఘాట్ రోడ్డును అభివృద్ధి చేసే విషయంలో నా వంతు సాయం చేస్తానని వేదపండితులకు, అధికారులకు మంత్రి హామీ ఇచ్చారు.




### ఆషాడం తొలి పూజల్లో పాల్గొన్న
# మంత్రులు కొండా సురేఖ, పొన్నం

**హైదరాబాద్ 16:** ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా లోయర్ ట్యాంక్ బండ్ వద్ద కుమ్మర్ల తొలి బోనం కార్యక్రమంలో మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. కనకాల కట్ట మైసమ్మ అమ్మవారికి పూజలు చేసి తొలి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ఈర్లపల్లి శంకర్, కార్పొరేషన్ చైర్మన్ లు మెట్టు సాయి కుమార్, మల్రెడ్డి రాంరెడ్డి, జాజుల శ్రీనివాస్ గౌడ్,ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

**హైదరాబాద్ 16:** పవన్ కళ్యాణ్ ని పరామర్శించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పరామర్శించారు. గవర్నర్ గురువారం ఉదయం హైదరాబాద్ లోని పవన్ కళ్యాణ్ నివాసానికి విచ్చేశారు. ఆయనతో మాట్లాడి శస్త్ర చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య నిపుణుల సూచనలు పాటించాలని చెప్పారు. త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో విధుల్లోకి రావాలని ఆకాంక్షించారు.పవన్ కళ్యాణ్ లైబ్రరీ తిలకించిన జస్టిస్ అబ్దుల్ నజీర్ పవన్ కళ్యాణ్ స్వగృహంలో ఉన్న లైబ్రరీని గౌరవ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ తిలకించారు. లైబ్రరీలోని పలు పుస్తకాలను పరిశీలించారు. ప్రఖ్యాత రచయితలు, స్కాలర్స్, విశ్లేషకులు, పబ్లిక్ పాలసీ మేకర్స్ రాసిన పుస్తకాలు పరిశీలించారు. వాటి గురించి పవన్ కళ్యాణ్ తో ఆసక్తిగా చర్చించారు. పవన్ కళ్యాణ్ కోరడంతో ఓ పుస్తకంపై జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆటోగ్రాఫ్ చేశారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ గారు ఎంతో ఆప్యాయతతో వచ్చి పరామర్శించినందుకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.



### పవన్ కళ్యాణ్ ని పరామర్శించిన
# గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



**గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారికి తొలి బోనంతో ప్రారంభమైన ఆషాడ బోనాల ఉత్సవాలు**

**హైదరాబాద్ 16:** గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారి బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రి కి అర్చకులు మంత్రోచ్ఛారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి మంత్రి సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బోనాల ప్రారంభోత్సవాన్ని




# సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు
### హెచ్ఎంఎస్ - తెలంగాణ రక్షణ సేన గాంధేయమార్గంలో పోరాడి సాధించిన సంయుక్త విజయం

**హైదరాబాద్ 16:** మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకుండా నెలల తరబడి కాలయాపన చేసిన అప్రజాస్వామిక కాంగ్రెస్ ప్రభుత్వం.. నిరంకుశ సింగరేణి యాజమాన్యం మా ఉద్యమానికి దిగివచ్చిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. ఎట్టకేలకు ఈనెల 17, 18 న మెడికల్ బోర్డు ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నది.. ఇది వేలాది మంది సింగరేణి కార్మికుల గెలుపు. వారసత్వ ఉద్యోగాలు సింగరేణి కార్మికుల హక్కు. వేలాది మంది కార్మికులు అనారోగ్య సమస్యలతో మెడికల్ ఆన్ ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నెలల తరబడి మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకుండా వారి మనోవేదనకు కారణమవుతోంది. మేము ఉద్యమించామని ఇప్పుడు మాత్రమే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయడం కాదు.. ప్రతి నెలా మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి. సింగరేణి కార్మికులు ఎవరిని సూచిస్తే వారికి వారసత్వ ఉద్యోగం ఇవ్వాలి.. మెడికల్ బోర్డు కు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ అన్ ఫిట్ చేయాలని ఆమె అన్నారు.

## వెల్కటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్



**సిద్దిపేట 16 :** ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ప్రతి రోజు క్రమం తప్పకుండా చదవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి విద్యార్థులకు సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్పాఠశాల ప్రాంగణం మొత్తం కలియతిరిగారు. మైదానంలో చెట్లు ప్రశాంతమైన వాతావరణం బాగుందని ప్రిన్సిపల్ ను అభినందించారు. పదవ తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అన్ని సబ్జెక్ట్స్ తరగతులు అవుతున్నాయా, మధ్యాహ్న భోజనం బాగుందా అని అడగ్గా అన్ని తరగతులు బాగానే అవుతున్నాయని భోజనం బాగుందని విద్యార్థులు కలెక్టర్ కి తెలిపారు. గోడపైన రాయించిన తెలుగు వ్యాకరణం, ఇంగ్లీష్ టెన్సెస్, గణిత సుత్రాలు, సైన్స్ సుత్రాలను చూపిస్తూ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. గోడపైన రాసినవి రోజు చూస్తుంటే వాటిని ఎప్పటికీ మర్చిపోకుండా జ్ఞాపకం ఉంటాయని, రోజు ఒకసారి వాటిని తప్పనిసరిగా చదవాలని తెలిపారు. సబ్జెక్టులో ఏదైతే రాదన్న టాపిక్ పలు మార్లు చదివితే రానీదంటూ ఏదీ ఉండదని, సమయాన్ని వృధా చేయవద్దని పుస్తక జ్ఞానంతో పాటు రోజు న్యూస్ పేపర్ చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను పెండింగ్ ఉంచకుండా అదే రోజు చదవాలని, మంచి క్రమశిక్షణతో కూడిన అలవాట్లను అలవర్చుకోవాలని, సబ్జెక్టుకు సంబంధించి ఏలాంటి డౌట్స్ ఉన్నా ఉపాధ్యాయుల దృష్టికి తేవాలని, భయపడుతూ, సార్ ఏమంటారో, అని వెనకడుగు వేయకూడదని, ధైర్యంగా తెలపాలని జీవితంలో ఏ రంగం ఎంచుకున్న దృఢంగా నిలబడినాలని తెలిపారు. పదవ తరగతి అనేది జీవితానికి ఒక పునాది వంటిదని ఇక్కడ బాగా చదివి అందరూ ఫస్ట్ క్లాస్ లో ఉత్తీర్ణులు కావాలని, మీకు మీ పాఠశాలకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి



**జననినాదం,నిర్మల్జూలై16:** ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెండింగ్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను వేగంగా పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, విద్యార్థుల సంక్షేమం, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్లు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, డీఎస్పీ శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మేడారం పనులపై మంత్రి సీతక్క సమీక్ష




**ములుగు16:** గురువారం నాడు మేడారం హరిత హోటల్లో మేడారం అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ పనులు, మౌలిక సదుపాయాల కల్పన, భక్తులకు మెరుగైన సౌకర్యాల ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి, పనులను నిర్ణీత గడువులో నాణ్యతతో మంత్రి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,జిల్లా అధికారులు, స్థానిక సర్పంచ్, పూజారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఆగస్టు 15లోగా విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్లు సీఎం రేవంత్

**హైదరాబాద్ 16:** తెలంగాణ రాష్ట్రంలోని 27.50 లక్షల మంది విద్యార్థులకు ఆగస్టు 15లోగా తొమ్మిది రకాల వస్తువులతో కూడిన ఎడ్యుకేషన్ కిట్లను అందజేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో జడ్పీ గర్ల్స్ హైస్కూల్ కొత్త భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. విదేశాల్లో విద్యా ప్రమాణాలను అధ్యయనం చేసేందుకు 50 మంది టీచర్లను విదేశాలకు పంపామని, ఈసారి మరో 150 మందిని సింగపూర్, సౌత్ కొరియా, ఫిన్లాండ్ దేశాలకు పంపుతున్నట్టు చెప్పారు.

## గోదావరిజలాలతోఉమ్మడిఖమ్మం సస్యశ్యామలం

మొదటిపేజీ తరువాయి...



మాట్లాడుతూ.. గతంలో సీతారామ ప్రాజెక్ట్ స్థానంలో ఉమ్మడి ఖమ్ముల జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'దుమ్ముగూడెం రాజీవ్ సాగర్, 'రుద్రమకోట ఇందిరా సాగర్' ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రణాళికలు రూపొందించారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అయితే గత కేసీఆర్ ప్రభుత్వం రీ డిజైనింగ్ పేరుతో తక్కువ ఖర్చుకో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల వ్యయాన్ని విమర్శించారు. రీ-డిజైనింగ్ నెపంతో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని విఠంగా రూ. 24,000 కోట్లకు పెంచేసి ఖజానాపై అదనపు భారం మోపారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే భారీగా నిధులు ఖర్చు చేశారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజాధనం ఇప్పటికే అధిక మొత్తంలో వ్యయం కావడం వల్ల ఇప్పుడు ఈ ప్రాజెక్టులను నిలిపివేయడం సాధ్యం కాదని, అందుకే వీటిని ఎలాగైనా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టులో పెండింగ్లో ఉన్న మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన, అత్యంత త్వరితగతిన పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. గోదావరిజలాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సీతారామ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తాం. గోదావరిపై చివరి ప్రాజెక్ట్ ఇది. దీనిపై దీనిపై ఆర్థిక భారం పడింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుర్మార్గంగా ఆలోచించి బడ్జెట్ పెంచి ప్రాజెక్టును బీడిజైన్ చేశారు. గోదావరి పై జరుగుతున్న అక్రమాలపై ఆనాడు శాననసభలో, బయట కూడా గళం విప్పాం. పెద్ద ఎత్తున ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నారు. ఇప్పటివరకు ఎంతమేర పనులు పూర్తయ్యాయో చూసేందుకు ఈ పర్యటన చేపట్టాం. ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా ప్రాజెక్టును పూర్తిచేస్తాం అని భట్టి విక్రమార్క అన్నారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఇరిగేషన్ పై లక్షల కోట్లు ఖర్చు చేశారని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమీషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ. లక్షా 30 వేల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోందని అన్నారు. సీతారామసాగర్ ప్రాజెక్టను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను పాదిస్తామని చెప్పుకొచ్చాడు. కేసీజర్ హయాంలో సీతారామసాగరు కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగు నీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీతారామసాగర్ వీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి మూడేళ్లలో ఎలా బీటలు పచ్చాయో చూశామని చెప్పారు. మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు. డీపీఆర్లో ఉన్న ఫౌండేషన్ను మార్చి మరో పద్ధతిలో నిర్మించారని తెలిపారు. సుందిళ్ల ప్రతిపాదిత స్థలంలో కాకుండా మరో చోట నిర్మించారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. మండిపడ్డారు. రైతుల నుంచి తాము వారి కోనుగోళు వేసి వేరుగా ఆకౌంట్ లో డబ్బులు వేశామని వెల్లడించారు. మూడు బ్యారేజీలు టెస్ట్ నడుస్తోందని.. లాజికల్ గా తమ ప్రభుత్వం సదుచుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్ట్ కూడా సరిగా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. అరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్ అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఉద్ఘోదించారు. రాష్ట్రపాలన మొత్తం ఈ జిల్లా నుంచే కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారికి తొలిబోనంతో ప్రారంభమైన ఆషాడ బోనాల ఉత్సవాలు

మొదటిపేజీ తరువాయి...



పురస్కరించుకుని డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శివసత్తులతో కలిసి అమ్మవారికి తొలి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కళాకారుల కోరిక మేరకు మంత్రి సురేఖ ఈరగోల చేతిలో ధరించి, వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాడ బోనాల ఉత్సవాల బుక్ లెట్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరఫున రూ. 11 లక్షల చెక్కును ఇరువురు మంత్రులు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తోందన్నారు. డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో హైదరాబాద్ లో పండుగ వాతావరణం నెలకొన్నదని అన్నారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల సమర్పణతో ఎల్ నినో ప్రభావం తగ్గి, భూతల్లి శాంతించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. బోనాల ఉత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద దేవాలయాతో పాటు, చిన్న చిన్న దేవాలయాలకు కూడా నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఆషాడ బోనాల ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సంతోషంగా అమ్మవార్లను దర్శించుకుని వెళ్ళేలా సకల ఏర్పాట్లను చేసినట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

### నేడు జిల్లాకు రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. కమిషన్ చైర్మన్, సభ్యుల రాక

### జిల్లా కలెక్టర్ కె.హరిత

**జననినాదం,ఆసిఫాబాద్,ప్రతినిధిజూలై 16:** నేడు రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులతో కలిసి జిల్లాకు రానున్నారని కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని, అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

## "మీ భద్రత మీ చేతిలోనే"...

**తుగ్గలి ఎస్సై నరేష్**

**తుగ్గలి కస్తూరిబా పాఠశాలలో అవగాహన సదస్సు.**



**తుగ్గలి 16:** మీ భద్రత మీ చేతులలోనే ఉంటుందని తుగ్గలి ఎస్సై నరేష్ తెలియజేశారు. మండల కేంద్రమైన తుగ్గలిలో గల స్థానిక కస్తూరిబా పాఠశాల యందు గురువారం రోజున తుగ్గలి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు తుగ్గలి ఎస్సై నరేష్ తమ పోలీస్ సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తుగ్గలి ఎస్సై నరేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతలో భాగంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అదేవిధంగా మహిళల భద్రతకు సంబంధించి ఎటువంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే 100,181 మరియు 112 నెంబర్లకు కాల్ చేయాలని తెలిపారు. పోలీస్ శాఖ నుండి వచ్చే ఐవిఆర్ఎస్ కాల్స్ యొక్క ఉద్దేశ్యం మరియు వాటికి ఎలా స్పందించాలో వివరించారు. అదేవిధంగా సైబర్ క్రైమ్ సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అపరిచితుల నుండి వచ్చే లింకులు, ఓటిపి లు ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించారు. అనుమానాస్పదంగా ఉంటే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్లైన్కు ఫిర్యాదు చేయాలని సూచించారు. చిన్నారులు తమ శరీర భద్రత గురించి తెలుసుకోవాలని, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఎస్ఓ షాహిన్, కేజీబీవీ పాఠశాల బోధనా సిబ్బంది, తుగ్గలి పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కుంట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ జానకి,

**పోలీస్ స్టేషన్ పనితీరుపై సమీక్ష, ప్రజలకు సత్వర, పారదర్శక పోలీసు సేవలు అందించడమే లక్ష్యమని సూచన**



**మహబూబ్‌నగర్ 16:** సీసీ కుంట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.జానకి, ఆకస్మికంగా సందర్శించి స్టేషన్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నమోదైన పెండింగ్ కేసుల పురోగతి, దర్యాప్తు స్థితి, గ్రేవ్ కేసుల విచారణ, నాన్-గ్రేవ్ కేసుల పరిష్కారం, వారెంట్ల అమలు, పెండింగ్ పిటిషన్లు, కోర్టు ట్రయల్‌లో ఉన్న కేసులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ సమీక్షించారు. ప్రతి కేసును వేగవంతంగా, నాణ్యమైన దర్యాప్తుతో పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే నేరాల నియంత్రణకు బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, గ్రామాల వారీగా అనుమానాస్పద వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ, ఆర్థిక మోసాల బారిన పడకుండా గ్రామస్థులను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి సత్వర సేవలు అందించాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా నమోదు చేసి నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఎస్పీ గారు తెలిపారు. స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణను కూడా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి నేరస్థులకు శిక్ష పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలతో ఛార్జిషీట్లు దాఖలు చేయాలని, ప్రజల్లో పోలీసులపై మరింత విశ్వాసం పెరిగేలా సేవలందించాలని సీసీ కుంట ఎస్ఐకి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సీసీ కుంట ఎస్ఐ ఓబుల్ రెడ్డి మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సైదాబాద్ సక్సెస్ స్కూల్లో ఇస్లాం బోధన

మొదటిపేజీ తరువాయి...



ఘటనపై తల్లిదండ్రులు స్కూల్ యాజ మాన్యాన్ని ప్రశ్నించగా, ఇదువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సంబంధించిన వీడియోలు అనంతరం పాఠశాల యాజమాన్యం స్పందించి, సంబంధిత ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా పర్వీను విధుల నుంచి తొలగించింది. అలాగే భవిష్యత్తులో సక్సెస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థల్లో ఆమెకు ఉద్యోగావకాశం కల్పించబోమని తెలిపింది. ఘటనపై విద్యార్థి కుటుంబ సభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుకు సంబంధించి న్యాయపరమైన అభిప్రాయం తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇదే సమయంలో పాఠశాల వద్ద బీజేపీ నాయకులు నిరసన చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పిల్లలకు మతపరమైన అంశాలను నేర్చుకోవాలని చెప్పడంపై తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయగా, 'మా స్కూల్లో చదవాలంటే ఇవి నేర్చుకోవాల్సిందే' అని సదరు టీచర్ చెప్పినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై స్కూల్ యాజమాన్యం, సంబంధిత టీచర్పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు సైదాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు. కాగా, ఈ వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. హిందూ విద్యార్థికి కల్మా, సూరా ఫాతిహా చదవాలని హోమ్వర్క్ ఇవ్వడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బలవంతంగా హిందూ సంస్కృతిపై దాడి చేస్తున్నారని మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యం.. కల్మా చదవాలని విద్యార్థికి హుకుం జారీ చేయడం దుర్మార్గం అన్నారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోకాల్డ్ సెక్యూలర్ సంఘాలు దీనిపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. హిందూ సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# డిజిటలైజేషన్ వేగవంతానికి రాజకీయ పార్టీల సహకారం అవసరం

## ఎన్యుమరేషన్ ఫారాల ప్రక్రియ 76 శాతం పూర్తి -- కలెక్టర్ కె. హరిత

**జననినాదం,ఆసిఫాబాద్,ప్రతినిధిజూలై 16:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కె. హరిత కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్‌రావుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 76 శాతం పూర్తయిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రక్రియ వేగంగా సాగుతుండగా, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి పూరించిన ఫారాలను బూత్ స్థాయి అధికారులకు అందేలా రాజకీయ పార్టీలు చొరవ తీసుకోవాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించినప్పటికీ, జిల్లాలో నిర్ణీత సమయానికి ముందుగానే



ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎఎస్‌డీ ఓటర్ల జాబితా పరిశీలన, రేషనలైజేషన్ ప్రక్రియను వెంటనే చేపట్టి మ్యాపింగ్ కాని ఓటర్లను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. బూత్ స్థాయి ఏజెంట్లు, బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను శాతం శాతం పూర్తి చేయడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓటరు ఫారాల డిజిటలైజేషన్‌కు రాజకీయ పార్టీలసహకారం అవసరం

## జిల్లా కలెక్టర్ కె.హరిత

**జననినాదం,ఆసిఫాబాద్,ప్రతినిధిజూలై 16:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.
జిల్లాలో ఇప్పటివరకు 76 శాతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రక్రియ వేగంగా సాగుతున్నప్పటికీ పట్టణ ప్రాంతాల్లో మరింత చురుకుదనం అవసరమని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పూరించిన ఫారాలు బూత్ స్థాయి అధికారులకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించినప్పటికీ, జిల్లాలో ముందుగానే డిజిటలైజేషన్ పూర్తి చేసేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అలాగే ఏఎస్‌డీ ఓటర్ల జాబితా, రేషనలైజేషన్ ప్రక్రియను వెంటనే చేపట్టి



మ్యాపింగ్ కాని ఓటర్లను గుర్తించనున్నట్లు తెలిపారు. బూత్ స్థాయి ఏజెంట్లు, బూత్ స్థాయి అధికారులతో సమన్వయంగా పనిచేసి డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావు, ఎన్నికల శాఖ అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలపై సమీక్ష గడువులోగా లక్ష్యాలు పూర్తి చేయాలి

**జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి జూలై 16:** కెరమెరి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ (ఈజీఎస్) సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు పురోగతిని అధికారులు విభాగాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), వీబీ--గ్రామ్ జీ చట్టం--2026 అమలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వనమహోత్సవం కింద గుంతల తవ్వకం, మొక్కల నాటకం, సోక్‌పిట్ల నిర్మాణం, ఎస్ఈఈపీసీ సర్వే, హట్ డ్వెల్లర్ల వివరాల సేకరణ, కమ్యూనిటీ కాంట్రిబ్యూషన్ (సీసీ) చార్జీల చెల్లింపులతో పాటు ఇతర కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా



అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్, హౌసింగ్ ఏఈ, ఏపీఓ, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలుగు భాషను మన సంస్కృతిగా భావించి విద్యార్థులకు బోధించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 16:** తెలుగు భాషను మన సంస్కృతిగా భావించి విద్యార్థులకు బోధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు భాషా శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాషను కేవలం ఒక పాఠ్యాంశంగా కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా భావించి విద్యార్థులకు బోధించాలని తెలుగు భాష ఉపాధ్యాయులకు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న వినూత్న బోధనా పద్ధతులను పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులలో తెలుగు భాషపై ఆసక్తి, అభిరుచిని పెంపొందించాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో ఇతర భాషల ప్రభావం కారణంగా విద్యార్థులకు తెలుగు భాషను సమర్థవంతంగా బోధించడం కొంత సవాలుగా మారిందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు తెలుగు ఉపాధ్యాయులు



సృజనాత్మక బోధనా విధానాలను అవలంబించాలని తెలిపారు. ముఖ్యంగా కథలు, కవితలు, పద్యాలు, నాటికలు వంటి సాహిత్య ప్రక్రియలను ఉపయోగించి విద్యార్థులలో భాషా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు, శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్సు కో- ఆర్డినేటర్ జంబోజు సత్తయ్య, శిక్షణ కేంద్ర ఇన్‌చార్జి బోనగిరి శ్రీనివాస్, జిల్లా స్థాయి డి.ఆర్.పి.లు, తెలుగు భాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అడవిని నరికితే కఠిన చర్యలు తప్పవు

## పోడు కేసులో 10 మందికి రూ.20 వేల జరిమానా

## తిర్యాణి ఎఫ్ఆర్‌వో రమాదేవి

**జననినాదం, తిర్యాణి 16:** పోడు వ్యవసాయం పేరుతో అడవిని నరికే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తిర్యాణి అటవీ శాఖ అధికారి (ఎఫ్ఆర్‌వో) రమాదేవి అన్నారు. మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన నలుగురు, అమీన్‌గూడకు చెందిన ఆరుగురితో కలిపి మొత్తం 10 మందికి జిల్లా కోర్టు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున మొత్తం రూ.20 వేల జరిమానా విధించినట్లు ఆమె తెలిపారు. గతంలో పోడు సాగు కోసం అటవీ భూమిలో చెట్లను నరికిన సమయంలో అటవీ శాఖ సిబ్బంది వారిని పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. విచారణ అనంతరం జిల్లా కోర్టు జరిమానా విధించిందన్నారు. అడవులను ఆక్రమించడం, చెట్లను నరికివేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని రమాదేవి స్పష్టం చేశారు. అడవుల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత కాపాడబడుతుందని, మానవ మనుగడకు అడవులే ఆధారమని పేర్కొన్నారు. ప్రజలు అటవీ చట్టాలను గౌరవించి, పోడు పేరిట అడవులను నాశనం చేయవద్దని పేర్కొన్నారు.



# ఏజెన్సీ చట్టాల అమలుపై ఆదివాసుల ఆందోళన

## కేరామెరిలో సంఘాల అత్యవసర సమావేశం.. అధికారులకు వినతిపత్రం

**జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి జూలై 16:** ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ హక్కులు అన్యాక్రాంతమవుతున్నాయని ఆరోపిస్తూ కెరమెరి మండల కేంద్రంలోని కుమురం భీం ఆదివాసి భవన్‌లో గురువారం ఆదివాసి సంఘాల నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల రక్షణకు ఉద్దేశించిన 1/70 నియంత్రణతో పాటు పెసా (గ్రాజుగ్రా) చట్టం అమలులో అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోందని వారు విమర్శించారు. గతంలో పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని నాయకులు పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం మండల తహశీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారంలో అధికారులు స్పందించకపోతే ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్, జిల్లా సలహాదారు డాక్టర్ కనక ప్రభాకర్, మహిళా




సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోవ ఇందిరా, మండల అధ్యక్షుడు కుడ్మేత సోము, విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు సెడ్మాకి తుకారాం, ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు పంద్రం యశ్వంత్‌రావు, టైగర్ సేనా రాష్ట్ర నాయకుడు పెందోర్ రాజేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మడవి పురుషోత్తం, కొలం సంఘం మండల అధ్యక్షుడు సిడాం ధర్మతో పాటు పలువురు ఆదివాసి సంఘాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ఆదివాసులు పాల్గొన్నారు

# పంట సాగులో వర్షపాతం, విత్తనాల లభ్యత ప్రధానాంశం

## విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు

## ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు





**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 16:** పంట సాగులో వర్షపాతం, విత్తనాల లభ్యత ప్రధాన అంశాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వాతావరణ మార్పులు, వ్యవసాయ సాగు, విద్యారంగ అభివృద్ధి, త్రాగునీరు ఇతర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో వానాకాలం--2026లో ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అయిన నేపథ్యంలో వ్యవసాయ సాగులో ప్రయోజనకర పద్ధతులను, పంట మార్పిడి విధానాలను రైతులకు వివరించి లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వానాకాలం సాగుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, జిల్లాల వారీగా విత్తనాల నిల్వలు, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. వానాకాలం--2026లో 138.49 లక్షల ఎకరాలలో పంటల సాగు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని, ఇందుకు అవసరమైన 19.68 లక్షల క్వింటాళ్ల విత్తనాల అవసరానికి గాను 74.44 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులకు ఎటువంటి కొరత తలెత్తకుండా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఈ ఏడాది 530.43 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకుని, సుమారు 3.98 కోట్ల రూపాయల విలువైన విత్తనాలను సీజ్ చేసి 73 మందిని అరెస్టు చేసి, 39 క్రిమినల్ కేసులు, 2 పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా స్థాయి ప్రత్యేక తనిఖీ బృందాలు విత్తన విక్రయ కేంద్రాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, అనుమానాస్పద ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని, పొరుగు రాష్ట్రాల సరిహద్దుల్లో కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని ఆదేశించారు. 5 జిల్లాలలో సాధారణ, 27 జిల్లాలలో లోటు, ఒక జిల్లాలో తీవ్ర లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. మండలాల వారీగా 36 మండలాలలో అధిక, 142 మండలాల్లో సాధారణ, 358 మండలాలలో లోటు, 85 మండలాలలో తీవ్ర లోటు వర్షపాతం నమోదైందని వివరించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

### విద్యార్థుల నమోదు లక్ష్యాలు వేగవంతంలి

ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు, ప్రీ-ప్రైమరీ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, తెలంగాణ మోడల్ స్కూళ్లలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల నమోదు వేగవంతం చేయాలని తెలిపారు. జిల్లాల కలెక్టర్లు పాఠశాలల వారీగా నమోదు పురోగతిని ప్రతిరోజూ సమీక్షిస్తూ, లక్ష్య సాధనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. ప్రీ-ప్రైమరీ విభాగాల ఏర్పాటు, బోధకులు/సిబ్బంది నియామకం, టీచింగ్--లెర్నింగ్ మెటీరియల్, ఫర్నిచర్‌తో పాటు అవసరమైన ఇతర సామగ్రి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, నియామకాలు, కొనుగోళ్లు పెండింగ్‌లో ఉన్న జిల్లాలు వాటిని తక్షణమే పూర్తి చేయాలని తెలిపారు. ప్రీ-ప్రైమరీ విభాగాలకు సంబంధించిన యూడైస్ వివరాలను పూర్తిగా నవీకరించి, విద్యార్థుల ప్రవేశాల సమాచారాన్ని సకాలంలో నమోదు చేయాలని సూచించారు. యూడైస్‌లో నమోదు కాని ప్రవేశాలను వెంటనే అప్‌డేట్ చేసి, వాస్తవ గణాంకాలు ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల ప్రవేశాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, తెలంగాణ మోడల్ స్కూళ్లలో కూడా నిర్దేశించిన ప్రవేశ లక్ష్యాలను పూర్తి చేసి, ఖాళీ సీట్లను త్వరితగతిన భర్తీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించే దిశగా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు విద్యాశాఖ అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, ప్రతి పాఠశాల స్థాయిలో విద్యార్థుల నమోదును పర్యవేక్షించి, లక్ష్య సాధనకు అవసరమైన చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులో పూర్తి అయ్యేలా పనుల వేగాన్ని మరింత పెంచాలని తెలిపారు. కేంద్రీకృత వంటశాలలు అన్నింటినీ సెప్టెంబర్ 30వ తేదీలోపు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని, తద్వారా విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### త్రాగునీటి పనులను వేగవంతం చేయాలి.

ప్రజలకు సురక్షితమైన త్రాగునీటి సరఫరా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా భావిస్తుందని, అమృత్ 2.0 పథకం క్రింద పైప్‌లైన్‌లు, ఓవర్ హెడ్ ట్యాంక్ లు, అంతర్గత పంపిణీ వ్యవస్థలకు సంబంధించిన మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలలో త్రాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

### సీజనల్ వ్యాధులను నియంత్రణపై ప్రత్యేక దృష్టిలి

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్రంలోని 33 జిల్లాలలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, జిల్లా, డివిజన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. సున్నిత ప్రాంతాలలో జ్వరాలపై ప్రత్యేక నిఘా చేపట్టి, ప్రతిరోజూ నివేదికలు పంపాలని, ప్రతి శుక్రవారం "డ్రై డే" కార్యక్రమం నిర్వహిస్తూ దోమల నివారణ చర్యలు, లార్వా నిర్మూలన, ఫాగింగ్, నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో శుభ్రత కార్యక్రమాలను ముమ్మరం చేయాలని తెలిపారు. పట్టణాలు, గ్రామాలు, పాఠశాలలు, వసతి గృహాలు, నిర్మాణ ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లు చేపట్టాలని, గత ఏడాదితో పోలిస్తే డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా కేసులు గణనీయంగా తగ్గినప్పటికీ, టైఫాయిడ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిరంతరం పర్యవేక్షించాలని, ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రులలో మందులు, పరీక్షా కిట్లు, రక్త నిల్వలు, అంబులెన్స్ సేవలు, అత్యవసర చికిత్స సౌకర్యాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్య, ఐసీడీఎస్, గిరిజన సంక్షేమ, రెవెన్యూ శాఖలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, త్రాగునీటి నాణ్యత, పాఠశాలలు, వసతి గృహాల పరిశుభ్రత, ప్రజలలో అవగాహన కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వానకాలం వ్యవసాయ సాగుకు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగులో అవసరమైన మెలకువలు అందించడం జరుగుతుందని, రైతు నమోదు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. త్రాగునీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ విద్యార్థులకు అవసరమైన సదుపాయాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, ముఖ్య ప్రణాళిక అధికారి, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ ఈ.ఈ., సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూముల హద్దులు ఖరారు.. వివాదాలకు చెక్

**సమగ్ర భూ సర్వేకు రైతులు సహకరించాలి**
**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్ కుమార్**



**జననినాదం,తిర్యాణి 16:** సమగ్ర భూ సర్వేతో భూముల హద్దులు శాశ్వతంగా ఖరారై భూ వివాదాలకు తెరపడుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్ కుమార్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వేపై అవగాహన కల్పించేందుకు గురువారం తిర్యాణి మండలంలోని గోయగం గ్రామపంచాయతీలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర భూ సర్వే భవిష్యత్తులో రైతులకు ఎంతో మేలు చేస్తుందని, భూ హక్కుల పరిరక్షణకు ఇది కీలకమని పేర్కొన్నారు. అపోహలకు తావివ్వకుండా అధికారులతో సమన్వయం చేసుకొని సర్వేను విజయవంతం చేయాలని రైతులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాన్ మాట్లాడుతూసమగ్ర భూ సర్వే ద్వారా భూముల హద్దులను ఖచ్చితంగా నిర్ధారించడంతో పాటు ప్రభుత్వ భూ రికార్డులు పారదర్శకంగా రూపొందుతాయన్నారు. తెలంగాణ సరిహద్దుల చట్టం--1923లోని సెక్షన్--1, సెక్షన్--6(1) ప్రకారం గ్రామాల్లో భూముల సరిహద్దుల గుర్తింపు, హద్దుల నిర్ధారణ ప్రక్రియను చట్టబద్ధంగా చేపడుతున్నట్లు తెలిపారు. సర్వే సిబ్బందికి రైతులు, భూ యజమానులు పూర్తి సహకారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీమ్ పటేల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతాం రాంచందర్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దే విజయ్, కూన సురేష్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## ప్రాణాపాయంలో ఉన్న వ్యక్తిని కాపాడిన మాజీ కౌన్సిలర్ సురేంద్ర.. సమయస్ఫూర్తితో ప్రాణం కాపాడిన వైనం..



**నందికొట్కూర్ 16:** బ్రాహ్మణకొట్టుకూరుబొల్లవరం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని నందికొట్కూరు మాజీ కౌన్సిలర్ సురేంద్ర అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. కర్నూలు నుంచి మిడ్తూరుకు బైక్‌పై ప్రయాణిస్తున్న డాక్టర్ ఫారుక్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై రక్తస్రావంతో అక్కడే పడి ఉన్నారు.వెనుకనే కారులో వస్తున్న మాజీ కౌన్సిలర్ సురేంద్ర ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించారు. గాయపడిన డాక్టర్ ఫారుక్ ను స్వయంగా ఎత్తుకుని తన కారులో ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. సమయానికి వైద్యం అందడంతో ప్రమాద తీవ్రత మరింత పెరగకుండా నివారించగలిగారు.ఈ విషయం తెలుసుకున్న బాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకుని సురేంద్ర చేసిన సేవాభావాన్ని కొనియాడారు. ఆపదలో ఉన్న వ్యక్తికి సకాలంలో సహాయం చేసి ప్రాణరక్షకుడిగా నిలిచిన సురేంద్రపై స్థానికులు ప్రశంసల వర్షం కురిపించారు.

## విశ్వనాథ ఆలయ చైర్మన్ పదవి బీసీలకే ఇవ్వాలి

**బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్**
**కలెక్టర్‌కు బీసీ సమాజ్ వినతి**



**జననినాదం, మంచిర్యాల 16:** శ్రీ విశ్వనాథ ఆలయ పాలకమండలి చైర్మన్ పదవిని బీసీ సామాజిక వర్గానికి కేటాయించి, పాలకమండలిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలు, ఇతర సామాజిక వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పాలకమండలి చైర్మన్ పదవిని చాలా కాలంగా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికే కేటాయించడం సామాజిక న్యాయ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాలకు కూడా నాయకత్వ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 16, 38, 46 స్ఫూర్తికి అనుగుణంగా ఆలయ పాలకమండలి నియామకాల్లో సమాన అవకాశాలు, పారదర్శకత, సామాజిక న్యాయం పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు జరిగిన నియామకాలపై సమీక్ష నిర్వహించి, రానున్న పాలకమండలి చైర్మన్ పదవిని బీసీ సామాజిక వర్గానికి కేటాయించేలా ఎండోమెంట్స్ శాఖకు తగిన సూచనలు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొలిశెట్టి లక్ష్మణ్, జిల్లా నాయకులు పెద్దపెల్లి సూరయ్య, చల్ల విజయ్‌కుమార్, కొండ రాజు, కుడుక మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## జీపాలెంలో ఎస్సై హరీష "పల్లెనిద్ర"...

**గంజాయి, సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన!...?**
**గంజాయి జోలికెళితే కఠిన చర్యలు.. ‘**
**స్త్రీశక్తి’ యాప్‌తో మహిళలకు రక్షణ**
**గాజులమండ్యం ఎస్సై హరీష!.**



**రేణిగుంట,16:** రేణిగుంట మండలం, జీపాలెం పంచాయతీ పరిధిలోని జీపాలెం ఎస్సీ కాలనీలో గాజులమండ్యం సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్సై) హరీష ఆధ్వర్యంలో "పల్లెనిద్ర" కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బస చేసిన ఎస్సై, స్థానిక ప్రజలతో ముఖాముఖి మాట్లాడి పలు సామాజికాంశాలు మరియు రక్షణ చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు.?ఈ సందర్భంగా ఎస్సై హరీష మాట్లాడుతూ.. యువతను పాడుచేస్తున్న గంజాయి సేవించడం చట్టపరంగా తీవ్రమైన నేరమని హెచ్చరించారు. గంజాయి వంటి వ్యసనాలకు బానిస కావడం వల్ల యువత మంచి, చెడుల విచక్షణను కోల్పోయి, నేరస్తులుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎవరైనా గంజాయి విక్రయించినా లేదా సేవించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.ఆపద సమయంలో మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘స్త్రీశక్తి’ మొబైల్ యాప్‌ను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఎస్సై సూచించారు. అదేవిధంగా ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. గుర్తు తెలియని వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించి బ్యాంకు వివరాలు కానీ, ఓటీపీలు కానీ ఎట్టి పరిస్థితిల్లోనూ పంచుకోకూడదని స్పష్టం చేశారు.?ఎస్సై హరీష ఇచ్చిన సందేశం పట్ల గ్రామస్తులందరూ హర్షం వ్యక్తం చేస్తూ పోలీసు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబేద్కర్ స్టార్ కృష్ణ మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వ్యవసాయంపై మక్కువ.. పశుపోషణపై ప్రత్యేక దృష్టి.

**తన వ్యవసాయ క్షేత్రంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.**
**వనపర్తి శాసనసభ్యులు .**



**వనపర్తి.16:** గురువారం ఉదయం దొడగుంటపల్లి శివారులోని తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన కొబ్బరి, మామిడి, జామ తోటలను పరిశీలించి, మొక్కల పెరుగుదలను చూసుకున్నారు.అనంతరం పెంచుతున్న గోవులకు, స్వయంగా అరటిపండ్లు తినిపిస్తూ వాటి బాగోగుల గురించి ఆరా తీసారు.ప్రస్తుతం వనపర్తి ఎమ్మెల్యేగా ప్రజాసేవలో బిజీగా ఉన్నప్పటికీ, వృత్తిరీత్యా ప్రముఖ కాంట్రాక్టర్ అయినప్పటికీ,తూడి మేఘారెడ్డి కి వ్యవసాయంపై ఉన్న అభిమానం ఏమాత్రం తగ్గలేదు.రైతు కుటుంబ విలువలను, వ్యవసాయం గొప్పతనాన్ని ఎప్పటికప్పుడు గుర్తుచేసుకుంటూ వ్యవసాయాన్ని తన జీవితంలో విడదీయరాని భాగంగా భావిస్తారు.పంటల సంరక్షణతో పాటు పశుసంపద అభివృద్ధిపైనా ప్రత్యేక శ్రద్ధ చూపడం ఆయన ప్రత్యేకత.ప్రజా సమస్యల పరిష్కారంలో నిత్యం నిమగ్నమై ఉండే ఎమ్మెల్యే మేఘారెడ్డి అవకాశం దొరికినప్పుడల్లా తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి పంటలు, తోటలు, పశువులను కోసం కొంత సమయాన్ని కేటాయిస్తుంటారు.రైతుల కష్టాలను ప్రత్యక్షంగా అర్థం చేసుకునే నాయకుడిగా, వ్యవసాయాభివృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలాధారమనే నమ్మకంతో ఆయన ఎల్లప్పుడూ రైతులకు అండగా నిలుస్తున్నారు.×బిప్రజాసేవను ఒక బాధ్యతగా, వ్యవసాయాన్ని ఒక జీవన విధానంగా భావించే ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గారు రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, పశు సంపద పరిరక్షణకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తూ ఆదర్శప్రాయమైన నాయకత్వాన్ని చాటుతున్నారు.

## రాజధాని ప్రాంతంలో మంత్రులు నారాయణ, నిమ్మల పర్యటన

**అమరావతి16:** గురువారం నాడు రాజధాని ప్రాంతంలో మంత్రులు నారాయణ, నిమ్మల రామానాయుడు,టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ పర్యటించారు. అమరావతిలో నిర్మాణంలో ఉన్న టవర్లను పరిశీలించారు. నిర్మాణాలు దాదాపు పూర్తి కావడంతో త్వరలోనే ప్రభుత్వానికి అప్పగిస్తామని తెలిపారు. నిర్మాణంలో తీసుకున్న జాగ్రత్తలను మంత్రి,ఎమ్మెల్యే లకు మంత్రి నారాయణ వివరించారు.మంత్రి మాట్లాడుతూ త్వరలోనే ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ లు ఇక్కడకు వచ్చి నివాసం ఉంటారు. అమరావతి నిర్మాణం అనుకున్న విధంగా పూర్తవుతుంది. సీఎం చంద్రబాబు,ఉ పముఖ్యమంత్రి పవన్ కు,బిజెపి నాయకత్వానికి ధన్యవాదాలని అన్నారుజమంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పిచ్చి తుగ్లక్ సైతం, అసూయ, ఆశ్చర్య పోయేలా అమరావతి పై గొడ్డలి పార్టీ నాయకుడు మాట్లాడుతున్నాడు. జగన్ మావిగన్ అంటే, సజ్జల విజయవాడ అని, పెద్దిరెడ్డి 30 రాజధానులు అంటూ రోజుకో మాట, పేటకో మాట మాట్లాడుతున్నారు. నాడు అమరావతి, మొన్న 3 రాజధానులు, నేడు మావిగన్ అంటూ స్థిరం లేని వ్యక్తి జగన్. కర్ణాటకకు బెంగుళూరు, తమిళనాడుకు చెన్నై, తెలంగాణాకు హైదరాబాద్ నుండి 70 శాతం ఆదాయం అందిస్తున్నట్లే, ఆంధ్రప్రదేశ్ కు అమరావతి ఆదాయం ఇస్తుంది.అమరావతి రాజధాని వైఖరిలో జగన్ తీరు చూస్తే ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుంది. అమరావతి కాదు మూడు ముక్కలంటూ, అయిదేళ్ళ కాలంలో మూడు ఇటుక ముక్కలు కూడా పెట్టలేదు. సచివాలయం అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, సుమారు 16,000 మంది ఒకేచోట పని చేసే విధంగా 5 ఐకానిక్ టవర్లు డిజైన్ చేశారు. ప్రపంచం లోనే అత్యంత పొడవైన సెక్రటేరియట్ భవనంగా 204 మీటర్లు ఎత్తుతో నిర్మిస్తున్నారు. దేశంలోనే సచివాలయం, హెచ్ఓడి టవర్లు ఒకే చోట మెదటి సారిగా నిర్మిస్తున్నది మన రాష్ట్రంలోనే. దేశంలోనే మొదటి డయా గ్రిడ్ బిల్డింగ్, లోపల ఎటువంటి పిల్లర్లు, లేకుండా, తుఫాన్ లు, వంటి ప్రకృతి వైపరీత్యాలు తట్టుకునేలా నిర్మిస్తున్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లకు 12 టవర్లలో 276 ప్లాట్స్ 90 శాతం నిర్మాణం పూర్తయ్యాయి. అల్ ఇండియా సర్వీస్ అధికారులకు 6 టవర్ల తో 138 ప్లాట్స్ 95 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. చంద్రబాబు నాయకత్వం లో ప్రపంచ స్థాయిలో ప్రజా రాజధాని నిర్మిస్తున్నాం. సీడ్ యాక్సెస్ రోడ్ కోసం మొత్తం 45.47 ఎకరాలకు గాను, 99. 5 శాతం మంది రైతులు నుండి భూమిని సమీకరించాం ఇంకా కేవలం 1.52 ఎకరాలు మాత్రమే భూ సమీకరణ ద్వారా రావలసి ఉంది. కేవలం ఒకరో, ఇద్దరో రైతులు రాజకీయ దురుదేశ్యం తో భూములు ఇవ్వకుండా అడ్డు పడుతున్నారని అన్నారు.

## శ్రీకాళహస్తిలో ఘనంగా ‘ప్రజా గ్రీవెన్స్

**వినతులు స్వీకరించి, తక్షణ పరిష్కారానికి ఆదేశించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి**



**శ్రీకాళహస్తి 16:** ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారికి అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. శ్రీకాళహస్తిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు గురువారం ‘ప్రజా గ్రీవెన్స్’ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున విచ్చేసిన ప్రజల నుంచి ఎమ్మెల్యే స్వయంగా వినతులు, అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన భూసమస్యలు, సంక్షేమ పథకాలు, స్థానిక మౌలిక వసతుల వంటి పలు సమస్యలపై సానుకూలంగా స్పందించారు. అర్జీదారుల సమస్యలను నిర్దేశిత గడువులోగా త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తగిన ఆదేశాలు జారీ చేశారు.?ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రతి ఒక్కరి సమస్యను పారదర్శకంగా పరిష్కరించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉ ందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## చెరువును కబళిస్తున్న మట్టి మాఫియా...

నిబంధనలకు నీళ్లొదిలిన అధికారులు
తూర్పు గోదావరి జిల్లా, గోకవరం మండలం,



ప్రభుత్వ ఆస్తిపై కన్నేసిన మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. నిబంధనలను బేఖాతరు చేసి కొత్తపల్లి గ్రామం చివర ఉన్న ప్రభుత్వ చెరువులో యథేచ్ఛగా ఏఅఃలతో మట్టి తవ్వకాలు జరుపుతున్న దృశ్యాలు స్థానికుల కెమెరాకు చిక్కాయి.గత కొన్ని రోజులుగా తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో ఏఅః, ట్రాక్టర్లతో వచ్చి చెరువు మట్టిని తవ్వి ట్రాలీలకు ఎక్కించి తరలిస్తున్నారు. ఫోటోల్లో కనిపిస్తున్నట్లుగా యంత్రాలతో పెద్ద పెద్ద గుంతలు తీసి మట్టిని అమ్ముకుంటున్నారు.పర్యావరణానికి, రైతాంగానికి పెను ప్రమాదంచెరువు మట్టిని ఇష్టానుసారం తవ్వేయడంతో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా దెబ్బతింటుంది. దీనివల్ల రాబోయే వర్షాకాలంలో కొత్తపల్లి, చుట్టుపక్కల గ్రామాల్లోని వేలాది ఎకరాల ఆయకట్టుకు నీరు అందకుండా పోయే ప్రమాదం ఉంది. అంతేకాదు, భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి సమస్య కూడా తలెత్తనుంది."చెరువే మా ప్రాణం. దాన్ని నాశనం చేస్తే మా బతుకులు ఏమైపోవాలి? ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. రాజకీయ నాయకుల అండతోనే ఈ అక్రమాలు జరుగుతున్నాయి సమాచారంఅధికారుల నిర్లక్ష్యమే కారణమామట్టి అక్రమ తరలింపుపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. గోకవరం రెవెన్యూ, మైన్స్, ఇరిగేషన్ శాఖ అధికారుల అలసత్వం వల్లే ఇలాంటి అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.అక్రమార్కులపై వెంటనే కేసులు నమోదు చేసి, ఉపయోగిస్తున్న ఏఅః, వాహనాలను సీజ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. చెరువును యథాపూర్వ స్థితికి తీసుకురావాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పరువురు కోరుతున్నారు.

## వర్షం కోసం రెండవ రోజు ముస్లిం సోదరులు ప్రత్యేక ఫాతెహాలు



**కౌతాళం 16:** మానవాళికి అత్యంత సన్నిహితమైన ఆహారం ఏదైనా ఉంది అంటే అది మంచినీళ్లు అని ఆఫీస్ సబ్ తెలిపారు. ముస్లిమ్స్ ఆధ్వర్యంలో గురువారం రెండవ రోజున వర్షం కోసం ప్రత్యేక ఫాతిహాలు ప్రార్థనలు జరిపారు. వారు మాట్లాడుతూ ఎల్ నీనో ప్రభావముల వర్షపాతం అతి తక్కువగా ఉండటంతో వేసిన పంటలు ఎండు ముఖం పెట్టడంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కళ్ళముందే ఆవిరివుతుంటే. అనేక ఇబ్బందులకు గురవుతున్నారని మానవ మనుగడకు ఒక పూట అన్నం లేక పోయిన పర్వాలేదు మంచినీళ్లు ప్రతి అరగంటకు అందరికీ కావలసిందేనని మానవ సృష్టిలో చెట్టు. చీమ మూగజీవగలకు. సైతం నీరు ఎంతో అవసరమని తెలిపారు. సకాలంలో వర్షాలు బాగాపడి రైతుల ముఖాల్లో ఆనందం విల్లు విరియాలని వారు పెట్టిన పెట్టుబడులు అధికంగా లాభాలు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జామియా మసిద్, నురాని,మసిద్,మదీనా మసీద్ ముస్లిం సోదరులు ఎక్కువ సంఖ్యలు ప్రత్యేక ఫాతిహాలు ప్రార్థనలు జరిపారు.

## మృత్యువాత నుండి బయటపడిన మత్స్యకారులు

**ఇద్దరికి తీవ్ర గాయాలు**

కేజిహెచ్ లు చికిత్సబోటుపై ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లారు. ఫిషింగ్ హార్బర్ కు దగ్గరలో సముద్రంలో చేపల వేట సాగిస్తుండగా సాగర జలాలు ఒక్కసారిగా వలను లాక్కున్నాయి. ఈ ఘటనలో పడవ బోల్తాపడి మత్స్యకారులపై పడింది. అలల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఆ బోర్డుతో పాటు మత్స్యకారులు పెద్ద రాళ్లకు మధ్యలో చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో మత్స్యకారులు బోటును పట్టుకొని ప్రాణాలతో బయటపడ్డారు. తాతారావు, ఆకాష్ అనే ఇద్దరు మత్స్యకారులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన గంగపుత్రులు కేజీహెచ్ లో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంతో రెండున్నర లక్షల పైగా విలువ చేసే బోటు, రెండు లక్షల రూపాయలు విలువ చేసే వల పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంతో మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోయారు. గంగమ్మ తల్లి అనుగ్రహంతో ప్రాణాలతో బయటపడ్డామని మత్స్యకారులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460